12-8-2000
ఆంధ్రప్రభ

## 'ప్రజా నాయకుడు ప్రకాశం' నాటకం నేడే

(ఆంధ్రప్రభ విలేఖరి)

**విజయవాడ, ఆగస్టు 11:** 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం 129వ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ 'రసరంజని' నిత్య నాటక పథకంలో భాగంగా రాష్ట్రంలో మూడు చోట్ల 'ప్రజానాయకుడు' పేరిట ప్రకాశం పంతులు జీవిత ఘట్టాలతో కూర్చిన నాటకాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నెల 10న తాడేపల్లి గూడెంలో ప్రదర్శితమైన ఈ నాటకం 11న విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్నట్లు నాటక రచయిత ఆచార్య మొదలి నాఘభూషణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ప్రకాశం జన్మదినమైన 13న ఈ నాటకాన్ని గుంటూరులో ప్రదర్శిస్తారు.

ఐదు దశాబ్దాల పాటు తెలుగువారి జీవితాలలో పెనవేసుకున్న రాష్ట్ర ప్రప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పేదకుటుంబంలో పుట్టి స్వయంప్రతిభతో ఉన్నతికి ఎదిగి న్యాయవాదిగా లక్షలు గడించి, ఆర్జించిన సర్వస్వాన్ని దేశంకోసం ఖర్చుచేసి చివరిదశలో దుర్భర జీవితాన్ని అనుభవించిన అకళంక దేశ భక్తుడు, నిస్వార్థ రాజకీయ నాయకుడు అని ఆయన పేర్కొన్నారు. ఇది ఆంధ్ర రాజకీయ చరిత్రను నాటకీకరించిన మొట్టమొదటి నాటకం అని, ప్రకాశం జీవిత చరిత్ర 'నా జీవిత యాత్ర' ఆధారంగా ఈ నాటక రచన జరిగిందని ఆయన తెలిపారు. వాస్తవ సంఘటనల స్ఫూర్తిగా, చారిత్రక నేపథ్య చిత్రణ మాధ్యమంగా సాగే ఈ నాటకంలో 50 మంది కళాకారులు పాల్గొంటారని, ఆనాటి ఉద్యమ గీతాలతో పాటు దేశభక్తిని ప్రబోధించే అనేక పద్యాలు కూడా ఈ నాటకంలో చోటు చేసుకున్నాయని ఆయన వివరించారు. 12 8 2000

# ఉత్తేజ పరిచిన "ప్రజానాయకుడు ప్రకాశం"

("ప్రజాశక్తి" సాంస్కృతిక విలేకరి)

హైదరాబాద్, ఆగస్టు 17 : ప్రముఖ నాటక ప్రయోక్త ఆచార్య మొదలి నాగభూషణ శర్మ దర్శకత్వంలో 'రసరంజని' కళాబృందం ప్రదర్శించిన "ప్రజానాయకుడు ప్రకాశం" నాటక ప్రదర్శన జంటనగరాల కళాభిమానులను ఆద్యంతం ఆకట్టుకుంటూ అడుగడుగునా ఉత్తేజ పరిచింది. 'రసరంజని' నిత్య నాటక ప్రదర్శనా సంస్థ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఈనెల 16,17వ తేదీలలో ఈనాటక ప్రదర్శనను రసవత్తరంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యంలోని ముఖ్యమైన జీవిత ఘట్టాలను సమకూర్చి చక్కని సన్నివేశాలు, సంభాషణలతో డాక్టర్ నాగభూషణ శర్మ ఈ నాటకాన్ని రూపొందించారు. బి.పి. ప్రసాద్ సహాయ దర్శకత్వం, గరిమెళ్ళ రామమూర్తి సెట్స్, కాస్ట్యూమ్స్ డిజైన్, సురభి పూర్ణ చంద్రశేఖర్ రంగాలంకరణ ఎన్. నాగుబాబు లైటింగ్ ఎఫెక్ట్స్ సమకూర్చారు. బాల ప్రకాశంగా సురభిమానస, యువప్రకాశంగా నడిమింటి జగ్గారావు, బారిష్టరు, ప్రజానాయకుడు ప్రకాశంగా చాట్ల శ్రీరాములు పోషించిన పాత్రలకు జీవం పోశారు. సహనటులుగా దుగ్గిరాల సోమేశ్వరరావు (హనుమంతరావు నాయుడు), బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి (ప్రకాశం తల్లి సుబ్బమ్మ), సురభి ప్రతిమ



ప్రజానాయకుడు ప్రకాశం నాటకంలో ఒక దృశ్యం

(శ్రీరాములు), బి.హెచ్. కల్యాణి(లక్ష్మమ్మ), క్రమధాటి వెంకటేశ్వర శర్మ (చిలకమర్తి లక్ష్మీ నరసింహా) ఎన్. మోహన్ (డాక్టర్, గాయకుడు) ఇంకా గరిమెళ్ళ రామమూర్తి తులసీ బాలకృష్ణ తదితరులు పాత్రోచితంగా నటించి నాటక ప్రదర్శనను అనుక్షణం రక్తి కట్టించారు. "నేను చేతల మనిషిని కానీ మాటల మనిషిని కాను", "నా దేహం, నా కాలం, నా ధనం దేశ ప్రజల శ్రేయస్సు కోసం", "మనిషి ఎప్పటికీ గుర్తుంచుకోవలసింది కృతజ్ఞత", "రాజకీయాల్లో నీతి లోపించిన తర్వాత నాకిక అక్కడ స్థానం లేదనిపిస్తోంది" తదితర సంభాషణలు ప్రేక్షకుల హృదయాలను కదిలించాయి. "గురు సాక్షాత్ పరబ్రహ్మ", "జననీ జన్మభూమిశ్చ", "కాయ్యోడా కాయ్యోడా సైమన్ గోబ్యాక్", 'భారత దేశము నాదేరా', 'మా కొద్దీ తెల్ల దొరతనము" తదితర పద్యాలు, పాటలు శ్రోతలను ఉత్తేజ పరిచాయి. కథకులుగా డాక్టర్ నాగభూషణ శర్మ, బి.పి. ప్రసాద్ వ్యవహరించారు. నాటక ప్రదర్శనానంతరం గరిమెళ్ళ రామమూర్తి కళాకారులను ప్రేక్షకులను పరిచయం చేస్తూ ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి జయంతి సందర్భంగా ఈ నాటక ప్రదర్శనను న్యూఢిల్లీలో ఈ నెల 23వ తేదీన 'రస రంజని' సమర్పణలో ప్రదర్శిస్తున్నామని వివరించారు.

శుక్రవారం 18-8-2000 ప్రజాశక్తి